నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | శనివారం 23 మార్చి 2024 | MAHABUBABAD

ఖాకీ రూప కామాంధుడు

■ తల్లితో వివాహేతర సంబంధం.. బిడ్డపై లైంగికదాడికి యత్నం

■ పోక్సో కేసులో సీఐ బీ సంపత్ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

సుబేదారి, మార్చి 22 : తన కూతురితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగికదాడికి యత్నించాడని ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ బండారి సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేసి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో సంపత్ వర్ధన్నపేట ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో కేయూ స్టేషన్ పరిధిలోని విజయగణపతి కాలనీకి చెందిన బాలిక తల్లితో పరిచయం ఏర్పడింది. సంపత్ కేయూసీ ఎస్ఐగా బదిలీ కావడంతో వీరిద్దరి మధ్య మరింత చనువు పెరిగింది. వివాహిత భర్త గమనించి 2022 డిసెంబర్‌లో అప్పటి పోలీస్ కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయడంతో సంపత్‌పై బదిలీ (వీఆర్) వేటు పడింది. అయినా సంపత్ ఆమెతో సన్నిహిత సంబంధాన్ని కొనసాగించాడు. దీంతో మహిళ భర్త అమె నుంచి దూరం కాగా, అదే ఫిబ్రవరిలో సంపత్‌కు, మహిళ మధ్య గొడవలు జరిగాయి. కొద్ది రోజుల క్రితం ఇంటర్ చదువుతున్న తన కూతురుతో సంపత్ అసభ్యకరంగా ప్రవర్తించాడని, లైంగికదాడికి ప్రయత్నించాడని సదరు మహిళ గురువారం కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు, సంపత్‌ను వరంగల్‌లోని ఆయన నివాసంలో గురువారం రాత్రి అదుపులోకి తీసుకొని, పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రాథమిక విచారణ చేపట్టారు. తర్వాత ఎంజీఎం వైద్యశాలలో మెడికల్ పరీక్షలు చేయించి, రిమాండ్‌కు తరలించారు. కాగా సంపత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎస్ఐ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సైబర్ క్రైమ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. 2012లో ఎస్ఐగా నియామకమైన అతడు, కుటుంబంతో వరంగల్‌లో నివాసముంటున్నాడు.

మందుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన డీఎంఈ

వరంగల్ చౌరస్తా, మార్చి 22: వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మందులను దొడ్డిదారిన కాజేసిన ఉద్యోగి తలకోటి నాగేందర్‌పై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సుమారు రూ. 81 వేల విలువైన మందులను బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్న ఇద్దరిని డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టుకున్న ఘటనపై శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ వాణి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. వారికి హాస్పిటల్ ఉద్యోగుల్లో ఎవరైనా సహకరించారా.. రోగులకు అందజేసిన మందుల రికార్డుల నమోదు ప్రక్రియలో ఏ విధానాన్ని అనుపరిస్తున్నారు.. ఎప్పటి వరకు నమోదు ప్రక్రియ పూర్తి చేశారు.. అనే అంశాలపై ఆరా తీశారు. ఓపీ ఫార్మాసిస్ట్ తలకోటి నాగేందర్, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి బలరాందాసుపై నమోదైన కేసు వివరాలు ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నుంచి అధికారికంగా అందని కారణంగా అధికారులు చర్యల కోసం వేచిచూస్తున్నారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్ సెలవులో ఉన్నందున శాఖాపరమైన చర్యలు చేపట్టాలని నేత్ర వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ భరత్‌కుమార్‌కు ఎంజీఎం సూపరింటెండెంట్ సూచించారు.

'అమ్మ' కమిటీలపై 'అధికార' పెత్తనం

■ కమిటీ ఎన్నుకున్నా బ్యాంకు ఖాతా తెరవకుండా అడ్డగింత

■ పాఠశాలపై అధికార పార్టీ నాయకులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని గ్రామస్తుల ఆరోపణ

ఇనుగుర్తి, మార్చి 22 : పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల ఎన్నిక కమిటీలను ఈ నెల 15న ఎన్నుకున్నది. ఇందులో భాగంగా ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ బాలాజీ వీవో అధ్యక్షురాలు రబియాబేగం, ప్రాథమిక పాఠశాలకు ధరణి వీవో అధ్యక్షురాలు బండి సమతను ఎన్నుకున్నారు. ఎన్నికైన రోజునే పాఠశాల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయుల పేర్లతో బ్యాంకులో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలి. కానీ, కొందరు అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఇప్పటికీ జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయలేదు. ప్రాథమిక పాఠశాలకు ఎంపికైన సమతను హైస్కూల్‌కు అధ్యక్షురాలిగా మార్చాలని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిపై కొందరు కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై కేసముద్రం ఎంఈవో శ్రీదేవిని ఫోన్‌లో సంప్రదించగా అమ్మ ఆదర్శ కమిటీలను ఒక్కసారి ఎన్నుకున్నాక మార్చడానికి వీలులేదని తెలిపారు.



ఎంపిక చేసిన కమిటీ తీర్మానం

ఉన్నతాధికారులు స్పందించాలి

– నీలం యాకయ్య, కోమటిపల్లి, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

అమ్మ ఆదర్శ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వ నియమావళి ప్రకారమే ఆయా గ్రామాల వీవో అధ్యక్షురాళ్లను ఎన్నుకున్నారు. మా గ్రామంలో కావాలనే కాంగ్రెస్ నాయకులు పాఠశాలపై రాజకీయం చేస్తూ ప్రధానోపాధ్యాయురాలి ఒత్తిడికి గురి చేస్తున్నారు. హైస్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రబియా బేగాన్ని మార్చితే ఎంతదూరమైనా వెళ్తాం. డీఈవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. ఉన్నతాధికారులు స్పందించి వారితో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయించాలి.

పిల్లలను బావిలో తోసేసి.. తానూ దూకి

■ తల్లీకూతురు మృతి.. క్షేమంగా బయటపడ్డ కుమారుడు

■ మహబూబాబాద్ జిల్లా వెంకటాపురంలో విషాదం

నెల్లికుదురు, మార్చి 22 : కుటుంబ కలహాలతో తల్లి తన పిల్లలిద్దరిని బావిలో తోసి తాను బావిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా తల్లీకూతురు మృతిచెందగా, కుమారుడు క్షేమంగా బయటపడ్డాడు. ఈ విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వెంకటాపురంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని శ్రీరామగిరి శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన ఆకుల లావణ్య(28) కుటుంబ కలహాలతో కూతురు నిత్యశ్రీ(6), 10 సంవత్సరాల వయస్సు కలిగిన కుమారుడు ముకేశ్‌లను గ్రామ శివారులోని బావిలోకి తోసేసి తానూ దూకింది. కుమారుడు ముకేశ్ క్షేమంగా బయటపడ్డాడు. ఎస్సై కె.క్రాంతికిరణ్ సిబ్బందితో చేరుకుని బావిలోని మృతదేహాలను బయటకు తీయించారు. తొర్రూరు డీఎస్పీ సురేశ్ వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'రెవెన్యూ' వేధింపులతో రైతు ఆత్మహత్య

■ ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేస్తామని రూ. 4.50 లక్షల వసూలు

■ సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్‌ల నిర్వాకం

■ మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ధర్నా

బచ్చన్నపేట, మార్చి 22 : రెవెన్యూ అధికారుల వేధింపులు భరించలేక ఓ రైతు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో చోటుచేసు కుంది. రైతు మృతదేహంతో బంధువులు, గ్రామస్తులు బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మాట రఘుపతి (45)కి కొన్నె శివారు పరిధిలో సర్వే నంబర్ 75,76లో ఉన్న 1.30 ఎకరాల భూమి రికార్డుకు రావడం లేదని సీనియర్ అసిస్టెంట్ సుమన్, సర్వేయర్ రవీందర్‌ను కలిశాడు. రికార్డుకు ఎక్కించాలని కోరగా వారు రూ. 6 లక్షలు లంచం డిమాండ్ చేయగా, చివర కు రూ. 4.50 లక్షలకు ఒప్పుకున్నారు. ఒకసారి రూ. 2 లక్షలు, మరోసారి రూ. 2.50 లక్షలు సర్వేయర్‌కు ఇచ్చా డు. రెండేండ్లుగా భూమి రికార్డులకు ఎక్కకపోవడంతో రఘుపతి నిలదీయగా ఆ భూమి కోర్టు పరిధిలో, ఇతరుల పేరున ఉండడంతో వీలు కాదని చెప్పారు. దీంతో రఘుపతి తన డబ్బులు తనకు ఇవ్వాలని ఎన్ని సార్లు తిరిగినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో రఘుపతి పెద్ద కుమార్తె వి వాహం చేయడంతో అప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఇటు డబ్బులు రాక, అటు భూమి రికార్డుల్లో ఎక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని బలవన్మ రణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకుని తిరిగి అడిగితే ఇవ్వకుండా వేధింపులకు పాల్పడడంతోనే రఘు పతి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో బచ్చన్నపేట తహసీల్ ఎదుట ధర్నా చేపట్టారు. రైతు కు టుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తహసీల్దార్ విశాలాక్షి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, సీపీఎం నాయకులు వెంకటేశ్, విజేందర్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రఘుపతి(ఫైల్)

'నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలి'

వరంగల్‌చౌరస్తా, మార్చి 22 : హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో జాతీయ స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఎంజీఎం అకడమిక్ హాల్‌లో శుక్రవారం ఆరు జిల్లాల ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బందికి ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివ రావు, అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, క్షయనియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి స్వప్నమాధురి పాల్గొన్నారు.

సెలవు రోజున కంకులు కాలుస్తూ..

అవినీతిలో సబ్ రిజిస్ట్రార్

'ఆదర్శం' ముసుగులో వసూళ్ల దందా..

■ ఏసీబీకి చిక్కిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

■ రూ.19,200 తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

■ ముసుగు తొలగి బయటపడ్డ అసలు రంగు..

■ ఉమ్మడి జిల్లాలో సంచలనం

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ శుక్రవారం ఏసీబీ వలకు చిక్కింది. 'సేవ' ముసుగులో ఆమె సాగిస్తున్న అవినీతి బాగోతం బట్టబయలైంది. తస్లీమాకు ఉద్యోగం వచ్చిన తర్వాత ములుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్‌గా 12 ఏళ్లపాటు అక్కడే విధులు నిర్వర్తించింది. గతేడాది బదిలీల్లో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చింది. సెలవు రోజుల్లో నాట్లు వేయడం, పత్తి ఏరడం, మిర్చి తెంపడం వంటి కార్యక్రమాలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం పొందింది. కార్యాలయానికి ఆటో, బస్సు, ద్విచక్ర వాహనాలపై వస్తూ విస్తృత ప్రచారం చేసుకునేది.. ట్రస్ట్ ద్వారా అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ, ఎవరైనా మరణిస్తే వారి ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం బస్తా, కొంత నగదు ఇచ్చి ఫొటోలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది. రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులతోనూ సెల్ఫీలు దిగుతూ వరుసలు కలిపేస్తుంది. ఇలా ఆమె ప్రజల్లో ప్రాచుర్యం పొందింది.

రూ.19,200 లంచం తీసుకుంటూ..

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన గుడగాని హరీశ్, తన 128 గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ కోసం మార్చి మొదటి వారంలో రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి రిజిస్ట్రేషన్ వివరాలు తెలిపాడు. వెంటనే సబ్ రిజిస్ట్రార్ తస్లీమ్ మహ్మద్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేశ్‌ను కలవాలని సూచించింది. దీంతో హరీశ్, వెంకటేశ్‌ను కలిశాడు. ప్రభుత్వ ధర ప్రకారం గజానికి రూ.100 ఉంటుందని గానీ ఇక్కడ మాత్రం గజానికి రూ.200 చొప్పున ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని వెంకటేశ్ చెప్పాడు. దీంతో హరీశ్ మళ్లీ సబ్ రిజిస్ట్రార్‌ను కలవగా మొత్తం రూ.19,200 ఇస్తే వెంటనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పింది. దీంతో హరీశ్ వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి వెంకటేశ్‌కు డబ్బు ఇస్తుండగా వారు శుక్రవారం వల పన్ని పట్టుకున్నారు. అదనంగా రూ.లక్షా72వేలు దొరకగా అవి ఎవరి నుంచి తీసుకున్నారనే వివరాలు తెలియలేదు. తస్లీమా, వెంకటేశ్‌లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యామ్‌సుందర్, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటేశ్

సెలవు వచ్చిందంటే చాలు పొలాల్లో దిగి నాట్లేస్తుంది.. చేన్లలో పడి పత్తేరుతూ.. మిరప కాయలు తెంపుతూ దిగిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తుంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో 'బాబాయ్, తమ్ముడూ' అంటూ వరసలు కలిపి సెల్ఫీలు దిగుతుంది.. ట్రస్ట్ పేరిట అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ.. బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ అంటూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకుంది.. ఇదంతా నాణేనికి ఒక వైపు అయితే.. మరోవైపు సేవ ముసుగులో ఆమె ఎత్తిన 'లంచావతారాన్ని' అవినీతి నిరోధక శాఖ శుక్రవారం బట్టబయలు చేసింది. మోస్ట్ పాపులర్.. మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం ఉమ్మడి జిల్లాలో సంచలనం రేపింది.

– మహబూబాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ), మహబూబాబాద్ రూరల్

'కమలం'లో అయోమయం

■ వరంగల్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిని తేల్చని బీజేపీ

■ నాలుగో జాబితాలోనూ లేని వరంగల్ పేరు

■ అభ్యర్థుల ప్రకటనలో దేశవ్యాప్తంగా ముందున్నా.. ఇక్కడ మాత్రం వెనుకంజ

■ సరైన నేతలు లేనందునేనా?

కేంద్రంలో రెండు సార్లు అధికారం చేపట్టిన బీజేపీ పరిస్థితి ఇక్కడ మాత్రం అయోమయంగానే ఉన్నది. శుక్రవారం విడుదల చేసిన నాలుగో జాబితాలోనూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి పేరు ఖరారు చేయకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతున్నది. రాష్ట్రంలో మొత్తం 17స్థానాలకు గాను 15 చోట్ల అభ్యర్థులను ప్రకటించిన కమలం పార్టీ, వరంగల్‌లో మాత్రం తేల్చకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు టికెట్ ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆ పార్టీకి సరైన నేతలు కరువైనందునే అరూరిని చేర్చుకొని టికెట్ ఇస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

– వరంగల్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

వరంగల్ ఎంపీ టిక్కెట్‌పై బీజేపీ ఎటూ తేల్చడం లేదు. శుక్రవారం నాలుగో జాబితాను ప్రకటించినా అందులో వరంగల్ పేరు లేదు. ఈ జాబితాతో కలిపి దేశ వ్యాప్తంగా 291 సీట్లకు బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో 15 చోట్ల అభ్యర్థులను ప్రకటించినా వరంగల్‌కు ఎవరనేది మాత్రం తేల్చలేదు. అభ్యర్థిని ప్రకటించకపోవడంతో బీజేపీ శ్రేణుల్లో అయోమయం నెలకొన్నది. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించి, ప్రచారాన్ని సైతం మొదలు పెట్టింది. మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, గత ఎన్నికల్లో పోటీ చేసిన చింతా సాంబమూర్తి బీజేపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి టీ కృష్ణ ప్రసాద్ ఇక్కడి నుంచి టిక్కెట్ ఆశించినా ఆయనకు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల స్థానాన్ని బీజేపీ కేటాయించింది. దీంతో స్థానిక నేతలే ఇప్పుడు టిక్కెట్ కోసం రేసులో ఉన్నారు.

సరైనోళ్లు లేకనే!

వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో పోటీ చేసేందుకు బీజేపీలో సరైన నాయకులు లేనందునే ఆ పార్టీ ఎటూ తేల్చుకోలేక పోతున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ మొదటి నుంచీ బీజేపీలో ఉన్న నాయకులెవరూ లేరు. గుండె విజయరామారావు, అరూరి రమేశ్ బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. కొండేటి శ్రీధర్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు నేతల్లోనే ఒకరికి టికెట్ రావాల్సి ఉన్నది. వరంగల్ స్థానంలో బీజేపీ గతంలో ఒకసారి గెలిచిందని, ఈ సెగ్మెంట్‌లో సరైన అభ్యర్థిని నిలిపితే ఫలితాలు అనుకూలంగా ఉంటాయని రాష్ట్ర నాయకత్వానికి ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పలుమార్లు విన్నవించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే కోణంలో బీజేపీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది. వరంగల్ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే వరకు ఆగడమా, ముందుగానే ప్రకటించడమా అనే విషయంలో ఆలోచిస్తున్నది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున మరో రెండుమూడు రోజుల్లో బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా అభ్యర్థుల ప్రకటనలో ముందున్న బీజేపీ, వరంగల్ సీటుపై మాత్రం నాన్చుడు ధోరణితో ఉండడం కాషాయ పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నది.

వేంకటేశ్వరస్వామి వారి కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ వైభోగమే..

■ పట్టువస్త్రాలను సమర్పించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

■ తరలివచ్చిన భక్తజనం.. కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

చిల్పూరు, మార్చి 22: బుగులు వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. పట్టువస్త్రాలు స్వర్ణ, వజ్ర వైడూర్య, ముత్యాల ఆభరణాలతో అలంకృతుడైన స్వామి వారు గజవాహనంపై మండపానికి ఊరేగింపుగా వచ్చారు. భక్తజన కోటికి సకల సంపదలను ప్రసాదించే మహాలక్ష్మి అమ్మవారిని పూల పల్లకిలో మంగళ వాయిద్యాలు, భజన బృందం, డప్పులు, బోనాలు, కోలాటాలతో కళాకారులు కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణ వేడుకలను పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం విశ్వక్సేనుడికి తొలి పూజలతో శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లకు రక్ష సూత్రధారణ చేసిన అర్చకులు వేద మంత్రోచ్చారణలతో స్వామి వారికి యజ్ఞోపవీతధారణ చేశారు. అనంతరం అర్చకులు వేద మంత్ర పఠనాలతో జీలకర్ర, బెల్లం తంతు నిర్వహించారు. ప్రభ్వుతం తరపున ఇన్‌చార్జి ఈవో, దేవాదాయ శాఖ నల్లగొండ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్ కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు శుభ లగ్న సుముహూర్తంలో భక్తజనుల గోవింద నామస్మరణ, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి మెడలో స్వామివారు మాంగల్యధారణ చేశారు. కల్యా ణ మహోత్సవాన్ని బ్రాహ్మణపెల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రీ రంగాచార్యులు, కృష్ణమాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఆలయ శాశ్వత దాత, మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మంచగిరి ఆలయ ఈవో మోహన్, చిల్పూరు తహసీల్దార్ సరస్వతి, ఎస్సై ముత్యం రాజేందర్, చిల్పూరు మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తీగల మహేందర్, మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, పాలకమండలి సభ్యులు సంగోజు మోహనాచారి, పెద్ది నారాయణ, పుల్యాల నారాయణరెడ్డి, జక్కుల రాజశేఖర్, కనకం మధు, గాజుల రజిని, బీ బాలరాజు, పీ కిరణ్‌రెడ్డి, మేకల మల్లేశం, డీ ఎల్లయ్య, ఏ సత్యనారాయణ, బీ వికాస్‌రెడ్డి, ఉప్పరి గణేశ్, ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, శేఖర్, విశాల్, కృష్ణ, మహేశ్, మాజీ సర్పంచ్‌లు మామిడాల లింగారెడ్డి, తాళ్లపెల్లి సమ్మయ్య, ఏదునూరి రవీందర్, మారబోయిన ఎల్లయ్య, పేరాల సుధాకర్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ ఎదుట మిర్చి రైతుల ధర్నా

■ రైతుల మిర్చిని కోల్డ్‌లో భద్రపరచాలని డిమాండ్

■ పోలీసులు, మార్కెట్ అధికారులు రంగ ప్రవేశం

■ రైతుల మిర్చిని నిలువచేసేందుకు అనుమతి

కాశీబుగ్గ, మార్చి 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని కోల్డు స్టోరేజ్‌ల్లో మిర్చి భద్రపరిచేందుకు అవకాశం కల్పించాలని శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు రైతులు మిర్చి బస్తాలు అమ్మేందుకు తీసుకొచ్చారు. ఖరీదుదారులు నిర్ణయించిన ధర మిర్చి రైతులకు నచ్చలేదు. వెంటనే పలువురు రైతులు తమ సరుకును కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకుందామని చాముండేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌కు వెళ్లగా.. వారు స్థలం లేదని ఇతరుల సరుకును దించుకున్నారు. దీంతో రైతులు సంబంధిత సిబ్బందిని కోరగా వారు నిరాకరించారు. దీంతో అక్కడే రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కావాలనే రైతుల సరుకులు నిల్వ చేసుకొనివ్వడం లేదని, ఖరీదు వ్యాపారుల సరుకును మాత్రమే నిల్వ చేసుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో ఎనుమాముల పోలీసు లు, మార్కెట్ కమిటీ అధికారులు చేరుకున్నారు. రైతుల సమస్యలు తెలుసుకొని సంబంధిత కోల్డ్ స్టోరేజ్ యజమానితో మాట్లాడి రైతులు మిర్చి బస్తాలు కోల్డులో వేసుకునేలా చేశారు. దీంతో రైతు లు ఆందోళన సద్దుమనిగింది. కాగా, రైతులు ఆందోళనతో జిల్లా మార్కెటింగ్ అధికారి పాలకుర్తి ప్రసాద్‌రావుతోపాటు గ్రేడ్-2 కార్యదర్శి రాము, గంగాధర్ కోల్డ్‌స్టోరేజ్‌లను తనిఖీ చేశారు. నిల్వ వివరాలను తెలుసుకున్నారు. కోల్డులు ఖాళీగా ఉంటే రైతులకు తప్పకుండా అవకాశం కల్పించాలని ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధర్నా చేస్తున్న మిర్చి రైతులు